

## వీవీలను నియమించాలి

ప్రభుత్వ స్కూళ్లలో విద్యావలంటీర్లను నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత రెడ్డి డిమాండ్ చేశారు.

- 9లో ▸



## బీసీ బంధు ప్రకటించాలి

బీసీలకు బీసీ బంధు ప్రకటించి రూ. 10లక్షలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు ప్రభుత్వాన్ని కోరారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
41.1 /29.1

## వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### చెరువులతో గంగపుత్రులకు ఉపాధి



బిచ్కుంద(జుక్కల్) : చెరువుల మరమ్మతులతో గంగపుత్రలకు ఉపాధి లభించిందని, రెండు పంటలకు రైతులకు సాగునీరు అందుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం బిచ్కుంద మండలం బండారెంజల్‌లో ఊరు చెరువు పండగలో ఎమ్మెల్యే హన్మంత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బండారెంజల్ చెరువులో పెంచిన చేపలను పట్టణాలకు తరలించి ఆర్థికంగా ఎదగాలన్నారు. జిల్లాలో ఒక లక్ష 11 వేల ఎకరాల్లో సాగైన ధాన్యంను కొనుగోలు చేశామన్నారు. అనంతరం చెరువులో బతుకమ్మ, తెప్పను నీళ్లలో వదిలి గంగమ్మ గుడిలో పూజలు చేశారు.

### చేపలు ఆరోగ్యానికి వరం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కామారెడ్డి క్రైం : చేపలు ఆరోగ్యానికి వరం లాంటివని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ ఆవరణలో గురువారం చేపల ఆహార మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపల ఆహార పండగను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు 100 శాతం రాయితీపై చేప విత్తనాలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లాలో ఒకే పాఠశాలకు సీబీఎస్‌ఈ గుర్తింపు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ గుర్తింపు పాఠశాల ప్రోబెల్స్ హైస్కూల్ ఒక్కటే ఉందని డీఈవో ఎస్.రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు అనుమతులు లేని పాఠశాలలో తమ పిల్లల్ని అడ్మిషన్ చేయవద్దని కోరారు.

### మెడికల్ కళాశాలకు కేంద్రం ఆమోదం

- 150 సీట్లతో ఈ ఏడాది ప్రారంభం





కామారెడ్డి టౌన్ : దేశంలో మొత్తం 50 నూతన వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్ర ఆమోదం తెలిపింది. దీంట్లో భాగంగా తెలంగాణలో 12 నూతన మెడికల్ కళాశాలల ఏర్పాటులో భాగంగా కామారెడ్డిలో కూడా మెడికల్ కళాశాలకు గతంలోనే ఎన్‌ఎంసీ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం గురువారం కళాశాలల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దీంతో కామారెడ్డిలో మెడికల్ కళాశాల ఈ ఏడాది ప్రారంభానికి ప్రక్రియ మొత్తానికి లైన్‌క్లియర్ ఇస్తూ పచ్చ జెండా ఊపింది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి అంటే ఈ యేడు నుంచి 150 సీట్లతో మెడికల్ కళాశాల ప్రారంభం కానుంది. కొన్ని మెడికల్ కళాశాలలో 150 మెడికల్ సీట్లకు కేంద్ర ఆమోదం తెలిపింది. నీట్ అర్హత సాధించిన మెడికల్ విద్యార్థులు ఈ ఏడాది కామారెడ్డి మెడికల్ కళాశాలను కూడా కౌన్సెలింగ్‌లో ఎంపిక చేసుకోవచ్చు. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు, ఎంసీహెచ్ ఆస్పత్రి భవనంపాత కలెక్టరేట్‌లో మెడికల్ కళాశాల కొనసాగనుంది.



తాడ్కోల్‌లో చెరువు వద్ద మత్స్యకారుల వలతో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



బీబీపేటలో బతుకమ్మను ఎత్తుకున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



బిచ్కుంద మండలం బండారెంజల్‌లో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

# ఊరూరా 'దశాబ్ది' వేడుక!

- వారం రోజులుగా జోరుగా కార్యక్రమాలు
- అంతటా పండుగ వాతావరణం
- జనం మధ్యే ఉంటున్న ఎమ్మెల్యేలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం 21 రోజుల పాటు ఊరూ, వాడా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని నిర్దేశించింది. ఈ నెల 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు నుంచి రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా ఎమ్మెల్యేలు స్థానికంగా ఉంటూ ఆయా కార్యక్రమాలకు హాజరవుతున్నారు.

సాక్షి, కామారెడ్డి : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తొలి రోజైన 2న జిల్లా పరిపాలనా కేంద్ర భవనంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఊరు, వాడా జాతీయ జెండావిష్కరణలు జరిగాయి. 3న రైతు వేడుకలు రైతు వేదిక భవనాల్లో నిర్వహించారు. జిల్లాలోని అన్ని క్లస్టర్లలో నిర్మించిన రైతువేదిక భవనాల్లో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతు వేడుకలు నిర్వహించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పద్మాజీవాడి రైతు వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, స్థానిక ఎమ్మెల్యే సురేందర్ పాల్గొన్నారు. రైతులతో కలిసి భోజనం చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి మండలం భవానీపేటలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పాల్గొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పలు గ్రామాల్లో జరిగిన రైతు వేడుకలకు హాజరయ్యారు. జుక్కల్ నియోజక వర్గంలోని బిచ్కుందలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పాల్గొన్నారు. 4న జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులందరూ ర్యాలీలో అనంతరం సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళల రక్షణకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న కార్యక్రమాలను ఈ వేదిక ద్వారా వివరించారు. 5న నియోజక వర్గ కేంద్రాల్లో విద్యుత్ విజయోత్సవాలు నిర్వహించారు. రైతులకు ఉచిత విద్యుత్ 24 గంటల పాటు అందించడం, మెరుగైన విద్యుత్తు సరఫరా వంటి అంశాలపై వివరించారు. ఆయా నియోజక వర్గ కేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. నాలుగు నియోజక వర్గాల్లో విద్యుత్తు విజయోత్సవ సభలు ఘనంగా జరిగాయి. సబ్‌స్టేషన్లు, విద్యుత్తు కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. 6న పారిశ్రామిక ప్రగతిపై జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల మంజూరు, ఉపాధి అవకాశాల పెరుగుదలపై వివరించారు. జిల్లాలోని ఆయా నియోజక వర్గాల నుంచి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలను సన్మానించారు. ఈనెల 7న సాగునీటి దినోత్సవం నియోజక వర్గ కేంద్రాల్లో నిర్వహించారు. సాగునీటి సౌకర్యాల కల్పనకు సంబందించిన అంశాలపై వివరించారు.



ఎల్లారెడ్డిలోని లింగారెడ్డి పేట గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



### ఊరూరా చెరువుల పండుగ..

జిల్లావ్యాప్తంగా ఊరూరా చెరువుల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు. బోనాలు, బతుకమ్మలతో మహిళలు చెరువుల వద్దకు వెళ్లి కట్ట మైసమ్మ ఆలయాల వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా గంగమ్మకు పూజలు చేశారు. మిషన్ కాకతీయతో చెరువులకు పునరుజ్జీవం కల్పించారని పేర్కొన్నా రు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కామారెడ్డి నియోజక వర్గంలోని బీబీపేట మండల కేంద్రంలో ఉన్న పెద్ద చెరువు వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువు వద్ద జరిగిన కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. బిచ్కుంద మండలం బండరెంజల్ గ్రామంలో జరిగిన చెరువుల పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్‌సింధేతో పాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సురేందర్ పాల్గొన్నారు. పిట్లం మండలంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ పాల్గొన్నారు. ఆయా చెరువుల వద్ద సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

### ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ..

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నాలుగు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రతినిత్యం జనం మధ్యే తిరుగుతున్నారు. ఆయా వర్గాల ప్రజలతో కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్య క్రమాలను వివరిస్తున్నారు. గడిచిన వారం రోజులుగా అంతటా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఈనెల 21 వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

### ప్రజలంతా నా కుటుంబ సభ్యులే..

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్ : నాభార్య, పిల్లలే కాదు.. నా నియోజకవర్గ ప్రజలంతా నా కుటుంబ సభ్యులేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమానికి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. నియోజక వర్గ ప్రజల అండదండలతోనే తాను ఇన్నేళ్ళుగా ప్రజాసేవ చేస్తున్నానన్నారు. రాష్ట్రంలోని 21,384 చెరువులను మిషన్ కాకతీయ ద్వారా రూ. 6 వేల కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. 2014న రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ దశాబ్దకాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడానికే ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఈనెల 21న బీర్కూర్‌లోని తిమ్మాపూర్‌లో ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా సుదర్శణయాగం చేపట్టనున్నట్లు వెల్లడించారు. హనుమాన్, అయ్యప్ప, సేవాలాల్, సరస్వతిమాల తదితర దీక్షాపరులను ఆహ్వానిస్తామన్నారు. అంతకు ముందు గ్రామస్తులు జీపీ ఆఫీస్ నుంచి చెరువు కట్ట వరకు బాజాభజంత్రీల మధ్య మహిళలు బతుకమ్మ, బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గంగపుత్రులు వలలతో ఆహ్వానం పలికారు.

చెరువు కట్టపై మహిళలు బతుకమ్మ ఆడగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వారి ని ఉత్సాహపర్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజమణి రాజు, ఎంపీటీసీ ఇందిర, ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మాగోపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం, రైతుబంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, నాయకులు భూషణ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, ఎజాస్, పాతబాలకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, కుమ్మరి రాజు, నూకల రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.



పిట్లం మండల కేంద్రంలో బోనమెత్తిన జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

# ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి





ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా జడ్జి ఎన్ శ్రీదేవి, పక్కన కలెక్టర్ జితేష్ వి పాటిల్

- జిల్లా జడ్జి ఎన్ శ్రీదేవి

కామారెడ్డి క్రైం : ప్లాస్టిక్ నియంత్రణకు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ శ్రీదేవి అన్నారు. కామారెడ్డిలోని రోటరీ క్లబ్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనలో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. ప్రజలు తక్కువ దూరం వెళ్లాల్సి ఉన్నప్పుడు కాలినడకన వెళ్లాలని, వాహనాల వాడకాన్ని తగ్గించి వాయు కాలుష్యం తగ్గించాలన్నారు. కామారెడ్డిలోని ఓ వీధిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని ప్లాస్టిక్ నిర్మూలన 100 శాతం జరిగేలా జిల్లా అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనలో రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లను వ్యాపార సంస్థలు, వీధి వ్యాపారులు వినియోగిస్తే ఆకస్మికంగా దాడులు చేసి కోర్టు ద్వారా జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. అనంతరంప్లాస్టిక్ కవర్ల నిర్మూలన విషయంలో రిసోర్స్ పర్సన్‌లు విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ జితేష్ వి పా టిల్ సూచించారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయడంతో మురుగు కాలువల్లోకి చెత్త వెళ్లి తద్వారా దోమలు, ఈగలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ప్లాస్టిక్ కవర్లను కాల్చవద్దన్నారు. ఈ సందర్భంగా జిల్లా వర్తక సంఘం, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులకు, మహిళలకు బట్ట సంచులను పంపిణీ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందు ప్రియా, కమిషనర్ దేవేందర్, పీపీ రాజగోపాల్ గౌడ్, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

- ప్రాణహిత పేరు మార్చారే తప్పా పనుల్లో పురోగతి లేదు
- అధికారంలోకి రాగానే 3 లక్షల ఎకరాలకు సాగు నీరు
- విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారు..
- భూంపల్లి రిజర్వాయర్ కోసం రూ. 1,000 కోట్లు ఇవ్వాలి
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



భూంపల్లి రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. గురువారం మండలంలోని భూంపల్లి రిజర్వాయర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. అంతకు ముందు రిజర్వాయర్ అలుగు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల పేరు మార్చి భూంపల్లి రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేసినందుకు ధర్నా చేస్తున్నామన్నారు. దివంగత సీఎం రాజశేఖర రెడ్డి ఉన్నప్పుడు కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు సాగునీరు అందించి రైతులను రాజు చేయడానికి ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని రూ. 1450 కోట్లతో ప్రారంభించి ఏడాదిలోపే రూ. 425 కోట్లు ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొమ్మిదిన్నర ఏళ్లలో రూ. 100 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయడం వల్ల రెండు నియోజకవర్గాల్లో రైతులు బాగా నష్ట పోయారన్నారు. ప్రాజెక్ట్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజల సొమ్ముతో సోకులు చేస్తున్నారన్నారు. రూ. 105 వేల కోట్లతో కాళేశ్వరం పేరున సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్ నియోజకవర్గాలకు సాగు నీరు అందించిన సీఎం భూంపల్లి రిజర్వాయర్‌పై నిర్లక్ష్యం చేశారన్నా రు. కాళేశ్వరం పంపుసెట్ల ఖర్చు 75 శాతం అయితే రైతు లబ్ది పొందేది కేవలం 25 శాతం మాత్రమేనన్నారు. నాటి కాంగ్రెస్ పాలనలో లిక్కర్‌పై రూ. 10వేల కోట్ల ఆదాయం వస్తే ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర హయాంలో రూ. 44వేల కోట్లు సంపాదిస్తున్నప్పటికీ ఆ సొమ్మంతా కేసీఆర్ ఖజానాకే వెళ్తోందన్నారు. కవితను తెలంగాణ ఆడపడుచులు అ క్కున చేర్చుకుంటే ఢిల్లీ లిక్కర్ స్కాం చేసి తెలంగాణ పరువు బజారున పడేసిందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రతి మండలంలో 132కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. అనంతరం నియోజకవ ర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎంగా రేవంత్‌రెడ్డికి అవకాశం దక్కిన తర్వాత రైతులకు రుణమాఫీ, ఇళ్ల నిర్మాణం, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు నెలల్లో 20,21,22 ప్యాకేజీల పనులు ప్రారంభించి రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కై లాస్ శ్రీనివాస్ రావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, డీసీసీ వైస్ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎన్ఆర్ఐసెల్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోతి లింగారెడ్డి, మైనార్టీసెల్ అధ్యక్షుడు గౌసొద్దిన్, నాయకులు జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

# దోపిడీ ఉత్సవాలను బహిష్కరించాలి

- రైతుల కళ్లల్లో కన్నీళ్లే తప్ప చెరువుల్లో నీళ్లే లేవు
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బాన్సువాడ : తెలంగాణ ప్రభుత్వం చేసిన దోపిడీతోనే దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని, ఈ ఉత్సవాలను బహిష్కరించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఊరురా చెరువుల పండగ చేస్తోందని, రైతుల కళ్లల్లో కన్నీళ్లు తప్పా చెరువుల్లో నీళ్లు లేవని అన్నారు. గురువారం బాన్సువాడకు వచ్చిన ఆయన స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి రాజీవ్‌చౌరస్తా వద్ద బీఎస్పీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. రూ. 105 కోట్లతో తెలంగాణ ప్రభుత్వం జరుపుకుంటున్న సంబరాలను ప్రజలు స్వచ్ఛందంగా బహిష్కరించాలని, నీ ళ్లు, నిధులు, నియామకాల పేరుతో గద్దెనెక్కిన కేసీఆర్ లిక్కర్, లికేజీ, లిఫ్ట్ ఇరిగేషన్ల స్కామ్‌లతో రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారని, పేపర్ లీకేజీతో 35 లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. ప్రశ్నించిన బీఎస్పీ కార్యకర్తలపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టారని అన్నారు. లిక్కర్ స్కామ్‌లో నిందితురాలు ఎమ్మెల్సీ కవితను సీబీఐ, ఈడీ ఎందుకు అరెస్ట్ చేయలేదో ప్రజలకు బీజేపీ సమాధానం చెప్పాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయిస్తామని, బీసీలు పార్టీ తరపున పోటీ చేస్తే 60 నుంచి 70 స్థానాలు బీసీలకే కే టాయిస్తామన్నారు. తనను ప్రజలు గజ్వేల్ నుంచే పోటీ చేయ మని కోరుతున్నారని, ప్రజలు ఎక్కడ పోటీ చే యమంటే అక్కడి నుంచి పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బాల్‌రాజ్, బాన్సువాడ అసెంబ్లీ అధ్యక్షులు హరిప్రసాద్, పట్టణ అధ్యక్షులు సురేష్, జుక్కల్ ఇన్‌చార్జి కరుణాకర్, బిచ్కుంద మండల అధ్యక్షులు పరుశురాం తదితరులు ఉన్నారు.

# రాక్షసుడిని ఓడించిన మాయా!

- ఇంగ్లిష్‌లో కథ రాసిన విద్యార్థి శ్రీజయ్
- 108 పేజీలతో పుస్తకం ముద్రణ



సాక్షి, కామారెడ్డి : పదో తరగతి పరీక్షలు రాసి సెలవుల్లో ఇంటి దగ్గర ఖాళీగా ఉన్న ఆ విద్యార్థి ఏదో ఒకటి చేయాలని ఆలోచించాడు. ఒక మంచి కథ రాయాలని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఉపాధ్యాయులతో, తల్లిదండ్రులతో చర్చించాడు. వారి ప్రోత్సాహంతో ఇంగ్లిష్‌లో మొదలుపెట్టి పూర్తి చేశాడు. అంతటితో ఆగకుండా తల్లిదండ్రుల సహకారంతో 108 పేజీల పుస్తకాన్ని ముద్రించి ఇటీవల ఆవిష్కరించాడు శ్రీజయ్ రెడ్డి. కామారెడ్డి పట్టణానికి చెందిన మనోజ్ రెడ్డి–వనమాలా రెడ్డి కుమారుడైన శ్రీజయ్ రెడ్డి స్థానిక లిటిల్ స్కాలర్స్ స్కూళ్లో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. ఓ క్రూరమైన రాక్షసుడిని మాయా అనే అమ్మాయి ఎలా ఎదురిస్తుంది, ఎలా ఓడిస్తుందన్న దానిపై కథ అల్లాడు. పుస్తకానికి 'మాయా' అన్న పేరు పెట్టాడు. ఆయన తల్లిదండ్రులు పుస్తకం ముద్రించి ప్రోత్సహించారు. లిటిల్ స్కాలర్స్ స్కూల్ కరస్పాండెంట్ పున్న రాజేశ్ తో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత శ్రీ జయ్ రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ మా అమ్మా, నాన్న నన్ను ఎంతగానో ప్రోత్సహించారని, టీచర్ శ్రీవాణి, లిటిల్ స్కాలర్స్ స్కూల్ చైర్మన్ పున్న రాజేశ్ ప్రోత్సహించారన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తల్లిదండ్రులు

## క్లుప్తంగా

### జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



**డిచ్‌పల్లి/నిజామాబాద్‌నాగారం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా ఆర్‌డీటీ స్టేడియంలో జూన్ 6నుంచి 8వరకు జరిగిన జాతీయ స్థాయి మినీ సబ్ జూనియర్ (అండర్–11) సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో తెలంగాణ రాష్ట్ర జట్టు విజేతగా నిలిచింది. రాష్ట్ర జట్టు విజయంలో డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి పాఠశాల విద్యార్థులు కిషోర్, శ్రీకాంత్ కీలకపాత్ర పోషించి రజత పతకాలు అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగామోహన్ గురువారం తెలిపారు. అలాగే అండర్ 11 బాలుర విభాగంలో రజిత పతకం, అండర్ 11 బాలికల విభాగంలో కాంస్యప తాకం, అండర్ 13 బాలబాలికల విభాగంలో కాంస్య పతాకం సాధించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిటాల శ్రీరామ్, సాఫ్ట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో ప్రవీణ్ అనొకర్, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్ బాబు చేతుల మీదుగా జిల్లా క్రీడాకారులు పతకాలు అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, గంగామోహన్ తెలిపారు.

### డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు సమావేశం

**నిజామాబాద్‌అర్బన్:** గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో గురువారం కామర్స్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తెవివి కామర్స్ హెచ్‌వోడీ రాంబాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ –కామర్స్ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఈ కామర్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు అధ్యాపకులను సన్మానించారు.

### అందుబాటులోకి నారాయణ టెక్నో స్కూల్



**నిజామాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నారాయణ టెక్నో పాఠశాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పాఠశాల ఏజీఎం శివాజీ తెలిపారు. నగరంలో పాఠశాలలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రభుత్వ అనుమతులతో సుభాష్ నగర్‌లో నారాయణ టెక్నో స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంచి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా నారాయణ విద్యాసంస్థను స్థాపించామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు పోకుండా పాఠశాలకు వచ్చి సందర్శించాలన్నారు. ఇప్పటికే 200పైగా అడ్మిషన్లు వచ్చాయని, విద్యార్థుల తల్లిదండ్రుల కలలు నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. పాఠశాలలో నర్సరీ పీపీ 1, 2 విద్యార్థులకు ఆటపాటలతో ఇంటిని సైతం మరిపించే బోధన విధానం అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు పాఠశాల విద్యతో పాటుగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అదనంగా చేరిస్తూ విద్య బోధన చేపడుతున్నామన్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్ స్థాయిలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన అందిస్తామన్నారు. సమావేశంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు..



# చేపల మార్కెట్‌లో 'మృగశిర కార్తె' సందడి

- జిల్లాలో జోరుగా చేపల కొనుగోళ్లు
- బోధన్‌లో నీటిమడులు ఏర్పాటు చేసి విక్రయించిన వ్యాపారులు



నిజామాబాద్‌లోని మార్కెట్‌కు తీసుకువచ్చిన చేపలు



బోధన్‌లో నీటిమడుల్లో ఆక్సిజన్ పెట్టి చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు



విక్రయించేందుకు తెచ్చిన 15 కిలోల చేప

నిజామాబాద్ జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లోని చేపల మార్కెట్‌లో గురువారం 'మృగశిర కార్తె' సందడి నెలకొంది. మృగశిర కార్తె ప్రారంభమవ్వగానే చేపలు తినడం తెలుగు ప్రజల ఆనావాయితీ. ప్రస్తుతం మృగశిర కార్తె ప్రవేశించడంతో నిజామాబాద్ జిల్లాలో రెండు, మూడు రోజులు చేపలకు డిమాండ్ ఏర్పడనుంది. మృగం, మిరుగు, మిర్గ, మృగశిర కార్తె వంటి పేర్లతో ఈ పండుగను జరుపుకుంటారు. రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రారంభమవ్వడంతో ఎండకాలం ఎండలు తగ్గి వాతావరణం చల్లబడుతుంది. ఒక్కసారిగా వాతవరణంలో మార్పులతో శరీర ఉష్ణోగ్రతలో మార్పులు జరిగి పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకోసం వర్షాకాలంలో సోకే వ్యాధులను అడ్డుకునేందుకు మృగశిర కార్తె ప్రారంభంలో చేపలు తినడం మంచిదని పెద్దలు చెప్పుంటారు.

**అమాంతం పెరిగిన ధరలు**

మృగ కార్తె ప్రారంభంతో చేపలకు మార్కెట్‌లో భలే డిమాండ్ ఏర్పడింది. బోధన్ మార్కెట్‌లో గురువారం బొచ్చలు, బంగారు తీగ, రవట చేపలు కిలో రూ.200 నుంచి 300 వరకు ఉండగా మొట్ట చేపలు కిలో రూ.600 నుంచి 800 వరకు ఉంటున్నాయి. చేపల వ్యాపారులు సైతం ప్రత్యేక ఏర్పాట్లతో చేపలను విక్రయిస్తున్నారు. బోధన్‌లో చేపల వ్యాపారులు తాత్కాలిక మడులను ఏర్పాటు చేసి, ఆక్సిజన్ సిలిండర్‌లను పెట్టి ప్రాణంతో ఉన్న చేపలను విక్రయిస్తున్నారు. ప్రజలు సైతం మంచి ప్రాణంతో ఉన్న చేపలు లభిస్తుండటంతో ధర విషయంలో ఆలోచించకుండా చేపలు కొనుగోలు చేస్తున్నారు. –బోధన్‌రూరల్ / డిచ్‌పల్లి /సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నిజామాబాద్‌లో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



డిచ్‌పల్లి మండలం మిట్టాపల్లి చెరువు వద్ద చేపలతో మత్స్యకారులు

# 'సలహా' సమావేశాలకు స్వస్తి!

- కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సలహా మండలి సమావేశాలను నిర్వహించని వైనం
- ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాలనే నిబంధన
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు




మోర్తాడ్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రి

**మోర్తాడ్(బాల్కొండ):** ఆస్పత్రులలో సౌకర్యాలను మెరుగుపరచడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం కోసం నిర్వహించాల్సిన సలహా మండలి సమావేశాలకు ప్రజాప్రతినిధులు స్వస్తి పలికారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆయా మండలాల ఎంపీపీలు చైర్మన్ లుగా కొనసాగుతున్నారు. సామాజిక ఆస్పత్రులకు మాత్రం నియోజకవర్గం ఎమ్మెల్యేలు చైర్మన్‌లుగా, ఇతర ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. వీరు ప్రతి మూడు నెలలకు ఒకసారి సలహా మండలి సమావేశాలను నిర్వహించాలనే నిబంధన ఉంది. కానీ బోధన్ మినహా, మిగతా ఆస్పత్రులలో సలహా మండలి సభ్యులు సమావేశాలపై దృష్టి సారించడం లేదు. మోర్తాడ్, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, నవీపేట్, వర్ని, కోటగిరిలలో 30 పడకల ఆస్పత్రులు, ఆర్మూర్‌లో వంద పడకల ఆస్పత్రి, బోధన్‌లో జిల్లా స్థాయి ఆస్పత్రి ఉంది. భీమ్‌గల్‌లో కమ్యూనిటీ ఆస్పత్రి భవన నిర్మాణం కొనసాగుతుండగా వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఇతర మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయినా బోధన్ ఆస్పత్రిలో మాత్రమే సలహా మండలి సమావేశం కొనసాగిస్తున్నారు. వైద్యులు సమావేశాలపై ప్రజాప్రతినిధుల కు సమాచారం ఇస్తున్నా నాయకులు పెడచెవిన పె డుతుండటంతో ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంది. సలహా మండలిలకు నిధుల కేటాయింపు లేకపోవడం కూడా సమావేశాల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి సలహా మండలి సమావేశాలను నిర్వహిస్తే వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరై రోగులకు అందుబాటులో ఉంటారని పలువురు సూచిస్తున్నారు.

# ఎక్కడా లేనివిధంగా రాష్ట్రం అభివృద్ధి

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



ఎడపల్లిలో కవితకు గజమాలతో స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు

**ఎడపల్లి(బోధన్):** దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బతుకమ్మ చెరువులో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసే పనిలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారన్నారు. ప్రతిపక్షాలు అనవసరంగా విమర్శలు చేస్తున్నాయన్నారు. ఎడపల్లి మండలంలో అభివృద్ధి పనులకు నిధులను కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రతి ఇంట ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ ఫలాలు అందని ఇల్లును చూపిస్తే తాను రాజీనామా చేస్తానని ప్రకటించారు. అంతకుముందు మండలంలోని నెహ్రూనగర్ గ్రామం నుంచి ఎడపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మ చెరువులో ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, ఎంపీపీ శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజు కొనసాగిన గడపగడపకు కాంగ్రెస్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**సుభాష్‌నగర్:** కాంగ్రెస్ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రెండోరోజు నగరంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం కొనసాగింది. ఇందులో భాగంగా 58వ డివిజన్ శంభునిగుడి నుంచి నుంచి పెద్ద బజార్ వరకు పార్టీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేసి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్‌లు హాజరయ్యారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని, 18 ఏళ్లు నిండి ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటీని ఇస్తామన్నారు. వరికి క్వింటాలుకు రూ.2500, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, ఇల్లు నిర్మించుకునేవారికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు. కాంగ్రెస్‌ను ఆశీర్వదించి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేశవేణు, సయ్యద్‌ఖైసర్ రత్నాకర్, నరేందర్‌గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**క్రైం కార్నర్**

# తమ్ముళ్ల చేతిలో అన్న హతం!

- తల్లి దగ్గరున్న బీమా డబ్బుల పంపకాల్లో వివాదమే కారణం

**కామారెడ్డి క్రైం:** తల్లి దగ్గరున్న బీమా డబ్బుల పంపకాల విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం ఒకరి హత్యకు దారితీసింది. ఈ ఘటన కామారెడ్డి పాత బస్టాండ్ ప్రాంతంలో బుధవారం రాత్రి చోటు చేసుకోగా గురువారం ఉదయం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో నివాసం ఉండే మహమ్మద్ ఫాతిమాబీకి నలుగురు కుమారులు(సాదిక్, ఖాజా, సలీం, అంజాద్), కుమార్తె ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు జరిగాయి. వారిలో రెండో కుమారుడు ఖాజా నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఖాజా మృతికి సంబంధించిన కేసు ఇటీవల పూర్తవడంతో అతడి భార్య పిల్లలకు రూ.4లక్షలు, తల్లి ఫాతిమాబీ పేరిట రూ.2.80 లక్షలు బీమా డబ్బులు వచ్చాయి. ఫాతిమాబీ వాటిలో నుంచి ముగ్గురు కుమారులు, కుమార్తెకు రూ.20వేల చొప్పున ఇచ్చింది. మిగితా రూ. 2లక్షలను తన వద్దే ఉంచుకుంది. జనగామలో ఉండే పెద్దకుమారుడు సాదిక్ రెండు రోజుల క్రితమే తల్లి డబ్బులు ఇస్తాననడంతో కామారెడ్డికి వచ్చాడు. బుధవారం సాయంత్రం తల్లి దగ్గర ఉన్న మిగితా డబ్బులను పంచి ఇవ్వాలనే విషయంలో అన్నదమ్ములైన సాదిక్, సలీం, అంజాద్‌ల మధ్య గొడవ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ తర్వాత ముగ్గురు కలిసి మద్యం తాగడానికి సిరిసిల్లా రోడ్డులోని ఓ వైన్స్ పర్మిట్ రూంకి వెళ్లారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో అన్నదమ్ముల మధ్య మళ్లీ గొడవ జరిగింది. అర్ధరాత్రి పాత బస్టాండ్ సమీపంలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. మృతుడిని సాదిక్(48)గా గుర్తించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందాలను పిలిపించి తనిఖీలు జరిపించారు. మృతదేహం పక్కనే అంజాద్ చెప్పులు ఉండడం, డాగ్‌స్క్వాడ్ బృందంలోని కుక్క అంజాద్ వద్దకే వచ్చి ఆగడంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా ముగ్గురు అన్నదమ్ములు కలిసి ఉన్నట్లు పుటేజీలు లభ్యమయ్యాయి. దీంతో మిగిత ఇద్దరు సోదరులు సాదిక్‌ను హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేశామని, విచారణ జరుగుతోందని ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

## మంత్రికి 'చారిత్రాత్మక విశేషాల పుస్తకం' అందజేత



**వేల్పూర్:** ఆర్మూర్ పట్టణ సామాజిక సేవకులు పట్వారి తులసికుమార్ స్వాతంత్ర్య చారిత్రాత్మక అంశాలను సేకరించి రూపొందించిన పుస్తకాన్ని గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి అందజేశారు. శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజానికి తనవంతు సేవలందిస్తున్న పట్వారి తులసికుమార్ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ప్రవాస భారతీయ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడు, చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల పునాదులపై కేటీఆర్, కవిత రాజకీయ పుట్టుక

- రైతులకు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ క్షమాపణలు చెప్పాలి
- పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

**సుభాష్‌నగర్:** అబద్దాల పునాదులపైనే మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత రాజకీయ పుట్టుక మొదలైందని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ డబ్బు అహంతో మాట్లాడుతున్నారని, తక్కువ సమయంలో కేసీఆర్ కుటుంబం ఎక్కువ దోచుకుందని ఆరోపించారు. 40శాతం కమీషన్ దోచుకున్న బీజేపీని కర్నాటకలో ప్రజలు ఇంటికి పంపించారని, 60శాతం వరకు కమీషన్ తీసుకున్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఇంటికి పంపించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. కాంగ్రెస్‌లో సీఎం అభ్యర్థి ఎవరని కేటీఆర్ అడుగుతున్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు సీఎం అభ్యర్థి ఎంపిక ఉంటుందన్నారు. ధరణితో పేదలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ ఆచరణకు సాధ్యమయ్యే హామీలే ఇస్తుందని, కాంగ్రెస్ అంటేనే నమ్మకమన్నారు. టీయూలో జరుగుతున్న అవినీతిని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు ఆపలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ ఎన్నికల సమయంలో బాండ్ పేపర్ రాసిచ్చి పసుపు బోర్డు తేకుండా మాట తప్పాడని, వెంటనే పసుపు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు శేఖర్‌గౌడ్, గంగారెడ్డి, వేణురాజ్, విపుల్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



**తెయూ(డిచ్‌పల్లి):** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కృషి చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాకాటి కరుణ సూచించారు. హైదరాబాద్ రూసా భవనంలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తల సమావేశం నిర్వహించగా తెయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డా.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ప్రకారం తెలంగాణలోని ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో గ్రేడ్ 3లో 63 శాతం, గ్రేడ్ 5లో 57శాతం విద్యార్థులు కనీసం చదవలేక, అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితి కరోనా అనంతరం తీవ్రమైందన్నారు. దీనికోసం తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తొలిమెట్టు (మన ఊరు- మనబడి- మన పిల్లలు) అనే కమ్యూనిటీ ప్రాజెక్టు ప్రారంభించామన్నారు. మొదటగా నాలుగు జిల్లాల్లో కొనసాగగా, ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. దీని కోసం ప్రతి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ నుంచి 10 –12 మంది వలంటీర్లను ఈ ప్రోగ్రాంలో చేర్పించినట్లయితే మొత్తం 25వేల మంది వలంటీర్లతో అతిపెద్ద ప్రోగ్రాం అవుతుందన్నారు. ఈ విషయమై తెలంగాణ యూనివర్సిటీలో త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

# నగరంలో ముసుగు దొంగల బీభత్సం





నగరంలోని ఓ షోరూంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయిన దుండగుల చోరీ దృశ్యాలు

- ఒక్క రాత్రిలో వివిధ కార్ల షోరూంలలో భారీగా నగదు అపహరణ
- సీసీ ఫుటేజీల్లో రికార్డయిన దృశ్యాలు

**డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):** నగరంలో ముసుగులు ధరించిన దుండగులు బీభత్సం సృష్టించారు. ఒక్క రాత్రిలో నగరంతోపాటు, నగర శివారులో ని ప్రముఖ కంపెనీల కార్ల షోరూంలలో మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బోర్గాం (పి) శివారులోని మారుతి నెక్సా, వరుణ్ మారుతి, ప్రకాష్ హ్యుండయ్, టాటా మోటార్స్ షోరూమ్‌లతో పాటు డిచ్‌పల్లి మండలం బర్థిపూర్ శివారులోని మహీంద్రా, హోండా షోరూముల్లో ముసుగులు ధరించిన నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తమ వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లతో షోరూంల వెనకభాగం గుండా లోనికి ప్రవేశించి, డబ్బులు ఉంచే లాకర్‌లను ఎత్తుకెళ్లారు. షోరూమ్‌ల సమీపంలోని పొలాల్లో లాకర్‌లను ధ్వంసం చేసి వాటిలో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. మహీంద్రా షోరూం నుంచి రూ.2 లక్షలు, హోండా షోరూం నుంచి రూ.1.80లక్షలు ఎత్తుకెళ్లారు. వరుణ్ మారుతి, నెక్సా షోరూమ్‌లలో లాకర్‌లు ఎత్తుకెళ్లినప్పటికీ అందులో డబ్బులు లేవని తెలిసింది. హ్యుండయ్, టాటా షోరూంల నుంచి సుమారు రూ.3 లక్షలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. పలు షోరూమ్‌లలో ఉన్న సీసీ కెమెరాల్లో దుండగుల చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. ఆయా షోరూమ్‌ల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



## పండుగ పూట విషాదం..

**–చేపల వేటకు వెళ్లిన జాలరి మృతి**



పసుపుల చిన్న సాయిలు మృతదేహం

**డిచ్‌పల్లి:** మృగశిర కార్తె (మిరుగు) సందర్భంగా మత్స్యకారులు తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పట్టి వాటిని విక్రయించి ఆదాయం పొందుతారు. ఈసందర్భంగా గురువారం మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో ఓ మత్స్యకారుడు చెరువులో చేపల వేటకు వెళ్లి, ప్రమాదవశాత్తు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మత్స్యకారుడు పసుపుల చిన్న సాయిలు (55) తోటి మత్స్యకారులతో కలిసి బర్థిపూర్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. వల అతడి కాళ్లకు చుట్టుకోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. గమనించిన తోటి మత్స్యకారులు వెంటనే అతడిని ఒడ్డుకు తీసుకువచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉన్నారు. పండుగపూట చిన్న సాయిలు మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

## చెరువులో పడి పశువుల కాపరి..

**నవీపేట:** మండలంలోని కోస్లీ శివారులోని చెరువులో ఓ పశువుల కాపరి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. భైంసాకు చెందిన తల్లీ, కొడుకులు రాధాబాయి, లక్ష్మణ్(18)లు గత కొన్నేళ్లుగా మండలంలోని ఎల్‌కె ఫారమ్ గ్రామంలో నివాసముంటున్నారు. లక్ష్మణ్ పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే పశువులను కోస్లీ శివారులోని చెరువులోకి నీళ్లు తాగించడానికి తీసుకుళ్లాడు. పశువులను బయటకు తోలేందుకు యత్నించగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఈ విషయమై పోలీసులను ప్రశ్నించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

## ముప్కాల్ ఆలయంలో చోరీ



**బాల్కొండ:** ముప్కాల్ మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీని పగులగొట్టి సుమారు రూ.50వేల వరకు నగదు ఎత్తుకెళ్లాని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గర్భాలయం తలుపులను ధ్వంసం చేసి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దీంతో గురువారం ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

# జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

**లింగంపేట(ఎల్లారెడ్డి):** జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన రాజమొల్ల అనిల్(25)కు మూడేళ్ల క్రితం పెళ్లయింది. ఇటీవల అతడికి కొడుకు పుట్టి చనిపోయాడు. ఆ బాధలో మద్యానికి బానిసై, జల్సాలకు అలవాటు పడటంతో అప్పులు పెరిగిపోయాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం అతడి వదినకు ఫోన్ చేసి తాను అన్నతో మాట్లాడాలి, ఫోన్ ఇవ్వమని అడిగాడు. దాంతో ఆమె ఇంటికి రమ్మని చెప్పింది. తాను రాలేను గ్రామ శివారులోని పటేల్ చెరువు వద్ద ఉన్నానని ఫోన్ పెట్టేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు అందరూ చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువు కట్టపై బైకు, చెప్పులు ఉన్నాయి. చెరువులో వెతికినా అతడు కనబడలేదు. గురువారం ఉదయం చెరువులో శవమై తేలాడు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన యువకులు**

**డిచ్‌పల్లి:** కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా, స్థానిక యువకులు గమనించి, ఆమెను కాపాడారు. మండలంలోని నడిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో గురువారం ఘన్‌పూర్ గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అదే సమయంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ ఏర్పాట్ల కోసం గ్రామస్తులు కొందరు చెరువు వద్దకు వచ్చారు. మహిళ చెరువులో మునిగిపోతున్న విషయం గమనించిన గ్రామ రైతు సమన్వయ కమిటీ సభ్యుడు గంగి చిన్న సాయిలు వెంటనే చెరువులో దూకి, వీఆర్‌ఏ సుదర్శన్ సాయంతో ఆమెకు ఒడ్డుకు తీసుకువచ్చాడు. అప్పటికే నీళ్లను మింగడంతో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. నీటిని బయటకు కక్కించి ఆమె కాపాడారు. అనంతరం మహిళను ఇంటికి పంపించారు. మహిళను రక్షించిన చిన్నసాయిలును గ్రామస్తులు, అధికారులు అభినందించారు.